Namasthe Telangana Dt-16/09/17.

# మెట్రో స్టేషన్లలో ఆటోమెటిక్ పార్కింగ్

- పలు కంపెనీలతో సంప్రదింపులు జరుపుతున్నాం
- అధునాతన పరికరాలు అందుబాటులోకి తెస్తాం
- ప్రయాణికులు సౌకర్యవంతంగా ఇంటికి చేరేలా ఏర్పాట్లు
- మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



హైటెక్స్‌లో జరిగిన చర్చలో మెట్రోరైలు ప్రాజెక్టు గురించి వివరిస్తున్న ఎండీ ఎన్వీఎస్ రెడ్డి..



ఆటోమెటిక్ పార్కింగ్ (నమూనా)

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

మెట్రో రైల్వే స్టేషన్లలో ఆటోమెటిక్ పార్కింగ్ టెక్నాలజీని ప్రవేశపెడుతామని మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆటోమెటిక్ పార్కింగ్ టెక్నాలజీ, స్మార్ట్ మొబిలిటీ యాప్, రోడ్ పేయింటింగ్ యంత్రాలు, బారియర్ అండ్ బూం గేట్లు మొదలైన అధునాతన పరికరాలను అందుబాటులోకి తేవడానికి కొన్ని కంపెనీలతో చర్చలు జరిపామన్నారు. హైదరాబాద్ హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో 'ట్రాఫిక్ ఇన్‌ఫ్రాటెక్' సంస్థ నిర్వహించిన 'ఫ్యూచర్ మొబిలిటీ చాలెంజెస్ అండ్ సొల్యూషన్స్' ప్యానెల్ చర్చలో మెట్రోరైలు ఎండీ పాల్గొని మాట్లాడారు. మెట్రో ప్రయాణికులు ఇంటికి చేరేవరకు సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు ఇతర ప్రజా రవాణా వ్యవస్థలను హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టుతో అనుసంధానిస్తున్నామన్నారు. ఈ దిశగా పనులు జరుగుతున్నాయని చెప్పారు. దేశంలోని ఇతర మెట్రో రైలు ప్రాజెక్టులతో పోల్చితే హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు అన్ని విధాలా శ్రేష్ఠమైనదని స్పష్టం చేశారు. కమ్యూనికేషన్ ఆధారిత రైలు నియంత్రణ, అతి తక్కువ విద్యుత్ వినియోగం, ఒకే స్తంభంపై కాంటీలివర్ పద్ధతిలో నిర్మించిన స్టేషన్లు వంటి అత్యాధునిక సాంకేతిక సౌకర్యాలు సమకూర్చామని పేర్కొన్నారు. ఫలితంగా హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు దేశంలోనే ఉత్తమ ప్రాజెక్టుగా నిలువడంతోపాటు, ప్రపంచంలోని గొప్ప ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచిందని వివరించారు.

**టీవోడీ జోన్‌గా 800 మీటర్ల స్థలం**

హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు విశేషాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. స్మార్ట్ టికెటింగ్, స్మార్ట్ పార్కింగ్, స్మార్ట్ ప్రయాణం వంటి సౌకర్యాల గురించి తెలియజేస్తూ, ప్రజా రవాణా వ్యవస్థలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. మెట్రో ప్రయాణికులు సురక్షితంగా తిరుగడానికి ఏయే ఏర్పాట్లు చేశారో, మెట్రో ప్రారంభమైన తర్వాత హైదరాబాద్ నగర వ్యాపార సామర్థ్యం ఎలా పెరుగనున్నదో వివరించారు. భవిష్యత్తులో మెట్రో వయాడక్ట్ కింద స్కైవాక్‌ల నిర్మాణం ఏ విధంగా జరుగనున్నదో వెల్లడించారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దే క్రమంలో సీఎం కేసీఆర్ సూచనల మేరకు హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు చేపట్టిన నగర పునర్నిర్మాణ, సుందరీకరణ పనులను, వాటి పురోగతిని తెలిపారు. రవాణా ఆధారిత అభివృద్ధి (టీవోడీ)పై అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ.. మెట్రో కారిడార్లకు ఇరువైపులా 800 మీటర్ల స్థలాన్ని ప్రభుత్వం టీవోడీ జోన్‌గా గుర్తించిందన్నారు. ఈ స్థలాల్లో మెట్రోమాల్స్ నిర్మించడానికి ప్రత్యేక మినహాయింపులు ఇచ్చిందని పేర్కొన్నారు. మెట్రో స్టేషన్ల వద్ద అధునాతనమైన పార్కింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఆటోమెటిక్ పార్కింగ్ విధానం అందుబాటులోకి తెచ్చేందుకు కొన్ని కంపెనీలతో చర్చలు జరిపినట్టు వివరించారు.